WELCOME TO THE SCHOOL OF
EDU APPROACH
EDU APPROACH PROFESSIONALS PVT. LTD.
WISDOM FOR NATION
EXPERT FACULTY | ONLINE CLASSES | FOCUSED APPROACH | GLOBAL OUTLOOK | SUCCESS DRIVEN
5 YEARS OF TRANSFORMING AMBITIONS INTO ACHIEVEMENTS

మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

7.10.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 161 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

# ఆ 45 ఎకరాలు గుర్తించండి



రెవెన్యూ అధికారులకు సీఎం ఆదేశం
కేసీఆర్ ఫాంహౌస్ ఉన్న ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో ముగిసిన సర్వే
343 ఎకరాలే ఉందన్న అధికారులు
రికార్డులకు, భూమికి మధ్య వ్యత్యాసం
భూరికార్డులు సమర్పించాలంటూ కేసీఆర్, కుటుంబీకులకు నోటీసులివ్వాలని నిర్ణయం
సర్వే నంబరు 325లో మిగిలే భూమిలో అమరవీరుల కాలనీ
సకల సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**జనతా న్యూస్, హైదరాబాద్, అక్టోబరు 6 :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో వారి ఫాంహౌస్ భూములకు సంబంధించిన రికార్డులను అప్పగించాలని కోరనున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల ఆచూకీ లభ్యం కాకపోవడమే ఇందుకు

మిగతా 2 లో

## రాహుల్ పోరాటంతో కేంద్రంలో వణుకు

జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకూ విశ్రమించం..
నేతల అరెస్టులను ఖండిస్తున్నాం: సీఎం రేవంత్
అరెస్టులు అప్రజాస్వామికం: కోమటిరెడ్డి
రేపు చలో లోక్‌భవన్.. పాల్గొననున్న సీఎం

2



# కదం తొక్కిన విపక్షాలు!

## ఇండి కూటమి ఆధ్వర్యంలో ఎంపీల భారీ ర్యాలీ

పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం దిశగా 300 మంది ఎంపీల మార్చ్
సర్ రద్దు, సీఈసీ రాజీనామాకు డిమాండ్
మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత
బ్యారికేడ్లెక్కి జాతీయజెండాతో నిరసన
పోలీసులకు చిక్కకుండా 'ఆకాశవాణి'లోకి రాహుల్.. అక్కడే రాత్రి వరకు నిరసన
ఆయన వెంట ప్రియాంక, కాంగ్రెస్ ఎంపీలు
9 గంటల హైడ్రామా తర్వాత బలవంతంగా అదుపులోకి.. అనంతరం విడుదల
జ్ఞానేశ్ సాయంతో మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్ ఓట్ల చోరీ: రాహుల్
ఎంపీలను కలవడానికి అభ్యంతరమేంటని ప్రశ్న
అపాయింట్‌మెంట్ కోరలేదన్న ఈసీ

3



దేశ రాజకీయాలను కుదిపేస్తున్న ఓట్ చోరీ వ్యవహారంపై విపక్షాలు కదం తొక్కాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ, ఇండి కూటమి ఎంపీలు చేపట్టిన నిరసనతో.. మంగళవారం ఢిల్లీ వీధుల్లో హైడ్రామా నడిచింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నేతృత్వంలో 300 మందికి పైగా ఎంపీలు (లోక్‌సభ, రాజ్యసభ) చేపట్టిన మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది.

## 15 రోజుల్లో డిపెండెంట్ ఆర్డర్లు!

సింగరేణిలో 250 మంది అభ్యర్థులకు ఉత్తర్వులివ్వండి
అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
సింగరేణి సమస్యలపై ఆ ప్రాంత మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్ష



సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న 250 డిపెండెంట్ ఆర్డర్లకు సంబంధించిన అన్ని ప్రక్రియలను 15 రోజుల్లో పూర్తి చేసి, అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు.

## ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం తగదు!

ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్లు
మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం: హరీశ్

దసరా, దీపావళి సమయంలో ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం.. విద్యుత్తు బిల్లుల రూపంలో భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు పేర్కొన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని పేర్కొన్నారు.

03



## రాహుల్‌కు అబద్ధాలు అలవాటే

ఈసీపై ఆయన ఆరోపణలు బాధ్యతారహితం
ఫామ్-6పై కాంగ్రెస్ మార్కు అబద్ధాల ప్రచారం
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేసి, ప్రజల్లో అప నమ్మకం కలిగించడం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చట్టపర వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రయత్నించకుండా.. ఏ ఆధారాల్లేకుండా కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఆరోపణలు ఆయన బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతున్నాయని, రాజ్యాంగ సంస్థలపై ఆయన అబద్ధాల ప్రచారం మరోమారు బట్టబయలైందని మంగళవారం ఓ ప్రకటనలో మండి పడ్డారు.



## సుప్రీం జడ్జిగా అపరేశ్ సింగ్ ప్రమాణం

గుజరాత్, ఢిల్లీ సీజేలు కూడా..
ప్రమాణ స్వీకారం చేయించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
37కు చేరిన సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య

.. వివరాలు 3లో

## 40 మంది అమెరికా పౌరసత్వాలు రద్దు

వారిలో ఒకరు భారతీయుడు
వేలిముద్రలతో దొరికిపోయిన బల్వీందర్ సింగ్
వాస్తవాలు దాచిపెట్టడంతో అమెరికా చర్యలు

.. వివరాలు 3లో



## రాజ్యాంగం పట్టుకొని రాహుల్ ఉపన్యాసాలు

తెలంగాణలో రేవంత్‌రెడ్డి అరాచక పాలన: కేటీఆర్

# 15 రోజుల్లో డిపెండెంట్ ఆర్డర్లు!

### సింగరేణిలో 250 మంది అభ్యర్థులకు ఉత్తర్వులివ్వండి
### అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
### సింగరేణి సమస్యలపై ఆ ప్రాంత మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్ష



**హైదరాబాద్, అక్టోబరు 6 :** సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న 250 డిపెండెంట్ ఆర్డర్లకు సంబంధించిన అన్ని ప్రక్రియలను 15 రోజుల్లో పూర్తి చేసి, అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి సుమారు 136 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, సింగరేణి అధికారుల కమిటీ సిఫారసుల ఆధారంగా మానవీయ కోణంలో వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ప్రజాభవన్‌లో సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్, ఎమ్మెల్యేలతో పాటు సంస్థ ఉన్నతాధికారులతో భట్టి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను ప్రజాప్రతినిధులు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ విన్న ఆయన.. తక్షణ చర్యలకు ఆదేశాలిచ్చారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆస్పత్రుల్లో ప్రతి నెలా బోర్డు మీటింగ్ నిర్వహించాలని, అక్కడే వీలైనంత మందికి పరీక్షలు నిర్వహించి మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని భట్టి ఆదేశించారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరవకపోవడంతో ఉద్యోగాల నుంచి తొలగించిన కార్మికులను వన్ టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూముల్లో 5774 ఎకరాలను సింగిరేణి సంస్థ తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించిందని భట్టి తెలిపారు. అందులో 4,500 ఎకరాలను వైఎస్ హయాంలో పేదలకు పంపిణీ చేశారని, మిగిలిన 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నెల రోజుల్లో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. సింగరేణి భూముల్లో ఇప్పటివరకు మైనింగ్ చేయని ప్రదేశాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణం కోసం నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరిట లేఅవుట్ వేయడానికి కార్యాచరణను సిద్ధం చేయాలని చెప్పారు. సింగరేణి పరిధిలోని ఏరియా ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సింగరేణి పరిధిలోని ప్రతి గ్రామానికీ వెళ్లి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు కోరగా.. భట్టి అంగీకరించారు. సింగరేణి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సింగరేణి సంస్థ నుంచి స్థలం కేటాయించాలని సూచించారు.

# ఈసీల నియామక ప్రక్రియను రద్దు చేయాలి

### మళ్లీ కమిటీలో సీజేఐకి చోటు కల్పించాలి
### రాష్ట్రంలో ముస్లిం ఓటర్లను తొలగించే కుట్ర: ఒవైసీ

**హైదరాబాద్, అక్టోబరు 6 :** భారత ఎన్నికల ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామక ప్రక్రియలో వెంటనే మార్పులు చేయాలని, ఈ కమిటీలో మునుపటి మాదిరిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, విపక్ష నేతలను భాగస్వాములు చేయాలని మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. దేశంలో మళ్లీ ప్రజలను రోడ్లమీదకు తీసుకురావడానికి వీలుగా ఎన్‌ఆర్‌సీ తేవాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుతోందని పేర్కొన్నారు. ఎస్‌ఐఆర్‌తో దేశంలో 10 కోట్ల మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆక్షేపించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి ఒవైసీ వినతిపత్రాన్ని అందించారు. గోషామహల్ నియోజకవర్గంలో 122 మంది ముస్లింల ఓట్లు తొలగించాలని ముద్రిత ఫామ్-7 పత్రాలను బీజేపీ కార్యకర్త ఒకరు సమర్పించారని, అక్కడి బీఎల్‌వో తిరస్కరించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. ముస్లింలపై ఎందుకు ఈ ద్వేషమని బీజేపీని ప్రశ్నించారు. కాగా ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎందుకు భాగస్వాములు కావడం లేదని విలేకరులు ప్రశ్నించగా.. ఇండి కూటమిలో మజ్లిస్ భాగస్వామిని కాదని వ్యాఖ్యానించారు.

# దొంగ ఓట్లు తొలగిస్తుంటే గగ్గోలు ఎందుకు?

### ఫారం 7 ఇచ్చిన వాళ్లపై కేసులు పెడతారా
### రాష్ట్రంలో 70 లక్షల దొంగ ఓట్లున్నాయన్న సింఘ్వీ మాటేంటి
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపాటు
### పాతబస్తీలో ఎంఐఎం గెలుపు దొంగ ఓట్ల వల్లేనని వ్యాఖ్య

**హైదరాబాద్, అక్టోబరు 6 :** సర్ ప్రక్రియలో భాగంగా దొంగ ఓట్లను తొలగిస్తుంటే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడ్ను ఎన్. రాంచందర్‌రావు కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. తెలంగాణలో 70లక్షల దొంగ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ 2018లో చేసిన ప్రకటన సంగతేంటని ప్రశ్నించారు. ఆ ప్రకటనకు అనుగుణంగా దొంగ ఓట్లను తొలగించాలా? వద్దా? కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలక్టోరల్ రిట్నరింగ్ అధికారి(ఈఆర్‌ఓ)కి ఫారం 7 ఇచ్చిన వారిపై కేసులు పెట్టడం ఏంటని ? ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈఆర్‌ఓకి ఫారం 7ని ఎవరైనా ఇవ్వొచ్చని, ఆ ఫారం ఇవ్వగానే ఓట్లు తొలగించరని, ఈఆర్‌ఓ ఇరు పార్టీలకు నోటీసులిచ్చి విచారణ చేపట్టి వివరాలను అన్ని పార్టీల బీఎల్‌ఏలకు అందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియంతా పాదర్శకంగా జరుగుతుందని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఎంఐఎం పార్టీ ఇన్నాళ్లూ దొంగ ఓట్లతోనే ఎన్నికల్లో గెలుస్తూ వచ్చిందని ఆరోపించారు. ఆ పార్టీ నేత ఒవైసీ ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ కార్యకర్తలపై కేసులు పెడుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే ఆరాటంతో కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతపై ప్రజల్లో విషం చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఫారం7ను భూతంలా చూపిస్తూ ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 2.8 కోట్ల మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ .. చనిపోయిన వారి పేర్లను జాబితాలో ఉంచాలా? తొలగించాలా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫారమ్-6 మార్పులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కూడా కాంగ్రెస్ వక్రీకరిస్తోందని ఆరోపించారు.

# ఆ 45 ఎకరాలు గుర్తించండి

మొదటి పేజీ తరువాయి

కారణం. శాసనసభలో గత నెల 16వ తేదీన 22ఏపై నిర్వహించిన చర్చలో భాగంగా కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. దాంతో, అక్కడి భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కూడా నిర్వహిస్తున్నారు.

విచారణ, సర్వే పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో తాము చేపట్టిన సర్వే వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు 325లో మొత్తం 388 ఎకరాలు ఉందని, తమ సర్వేలో అక్కడ 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలిందని చెప్పారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా అక్కడ ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని వివరించారు. దాంతో, ఆ 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని అధికారులను సీఎం ఆదేశించారు. భూమి గుర్తింపునకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదేశించారు. సర్వే నంబరు 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూములు ఉన్నందున.. భూముల



రికార్డులు సమర్పించాలంటూ వారికి నోటీసులు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. ఇక, సర్వే నంబరు 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం ఇక్కడ అమరవీరుల కాలనీని నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలనీలో అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సకల సౌకర్యాలతో కాలనీని రూపుదిద్దాలని నిర్దేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ అధికారులు తీసుకోవాలని, జూన్ రెండో తేదీలోగా కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినియోగించే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాహుల్ పోరాటంతో కేంద్రంలో వణుకు

### జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకూ విశ్రమించం..
### నేతల అరెస్టులను ఖండిస్తున్నాం: సీఎం రేవంత్
### అరెస్టులు అప్రజాస్వామికం: కోమటిరెడ్డి
### రేపు చలో లోక్‌భవన్.. పాల్గొననున్న సీఎం

**హైదరాబాద్, అక్టోబరు 6 :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)ను రద్దు చేయడంతోపాటు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ విశ్రమించబోదని స్పష్టం చేశారు. సర్ రద్దు కోసం ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

చట్ట విరుద్ధమైన అరెస్టులు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమన్నారు. స్వాతంత్రోద్యమంలో గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి నేతలను నాటి వలస ప్రభుత్వం అరెస్టు చేసిందని, ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ (బీజేపీ) కూడా అలానే రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని విమర్శించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును రక్షించుకునేందుకు ప్రజలు, యువత ఈ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్రం గుర్తించాలని హెచ్చరించారు. స్వాతంత్ర్యం కోసం వందేళ్లకు పైగా పోరాడిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన పోరాటంలో విజయం సాధించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాగా, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేయడం అత్యంత హేయమైన చర్య అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరించడం బీజేపీ అహంకారపూరిత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత లోపించిందని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. దానికి సమాధానం చెప్పలేక అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాగా, జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇండీ కూటమి ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఇండీ కూటమి ప్రతినిధులు పాల్గొననున్నారు.

# రహదారుల నిర్మాణంలో భద్రతకే పెద్దపీట

### డిజైన్లు మెరుగ్గా ఉంటే చాలదు..
### నాణ్యతలో రాజీ పడకూడదు
### ప్రారంభానికి ముందే ప్రమాణాల మదింపునకు అంబుడ్స్‌మన్
### గుజరాత్‌లో జరిగిన 'చింతన్ శివిర్ -2026'లో మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 6 :** రహదారుల నిర్మాణం విషయంలో ప్రయాణికుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎన్ని కిలోమీటర్లు నిర్మించామన్నది ముఖ్యం కాదన్నారు. సురక్షిత, సాఫీ, వేగవంతమైన ప్రయాణానికి భరోసానిచ్చే విధంగా రహదారులు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని ఎక్తానగర్‌లో 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' ప్రాంగణంలో నిర్వహించిన 'చింతన్ శివిర్-2026'లో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్లను డిజైన్ చేయడంతోపాటు, నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు.

హైదరాబాద్-విజయవాడ రహదారిపై (ఎన్‌హెచ్-65) జరుగుతున్న ప్రమాదాలపైనా మంత్రి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాక్ స్పాట్లను గుర్తించడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించాలన్నారు. ఈ మార్గంలో వాహనరద్దీ విపరీతంగా పెరిగిపోయినట్లు చెప్పారు. ప్రస్తుతమున్న నాలుగు లేన్ల రహదారిని 6ం2 లేన్లతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లామని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతానికి తగ్గించాలన్న జాతీయ లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని మంత్రి వెంకట్ రెడ్డి సూచించారు. డిజైన్ ఎంత మెరుగ్గా ఉన్నా నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ప్రయోజనం ఉండదన్నారు. స్వీడన్ అమలు చేస్తున్న 'విజన్ జీరో'. ఆస్ట్రేలియా అనుసరిస్తున్న 'సేఫ్ సిస్టమ్' విధానాలను అధ్యయనం చేశామని, వీటి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని తెలిపారు. అలాగే కీలక రహదారులను ప్రారంభించే ముందు.. భద్రతా ప్రమాణాలు పూర్తిగా అమలయ్యాయా లేదా అన్నది పరిశీలించేందుకు 'రోడ్డు భద్రత అంబుడ్స్‌మన్' లేదా భద్రతా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. 2023లో దేశవ్యాప్తంగా 1,72,890 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా.. ఒక్క తెలంగాణలోనే 7,660 మంది మృత్యువాత పడడం ఆందోళనకరమని మంత్రి పేర్కొన్నారు.

# ఐఎన్ఎస్ సూర్య జల ప్రవేశం

### విశాఖకు మరో మైలురాయి
### తొలి స్వదేశీ ఫ్లీట్ సపోర్ట్ షిప్ ఎఫ్ఎస్ఎస్-5కు రక్షణ మంత్రి రాజ్నాథ్ శంకుస్థాపన
### విశాఖను మెరైన్ ఇండస్ట్రియల్ హబ్ తీర్చిదిద్దాలి
### రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**విశాఖపట్నం :** విశాఖపట్నం మరో కీలక సముద్ర రక్షణ మైలురాయికి వేదికైంది. హిందుస్థాన్ షిప్యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ ఎల్)లో దేశీయంగా నిర్మించిన తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్-1) 'ఐఎన్ఎస్ సూర్య' మంగళవారం జలప్రవేశం చేసింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఈ నౌకను ప్రారంభించడంతోపాటు ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్-5)కు కీలకమైన కీల్ లేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సందర్భంగా హెచ్ఎస్ఎల్లో ఆధునీకరించిన స్లిప్వే-1, 300 టన్నుల సామర్థ్యం కలిగిన గోలియత్ క్రేన్‌ను ప్రారంభిం చారు. ఈ మూడు కార్యక్రమాలు భారత నౌకానిర్మాణ సామర్థ్యాన్ని మరింత పెంచే కీలక ఘట్టాలని రాజ్నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఎఫ్ ఎస్ఎస్-1 జలప్రవేశం సాధించిన విజయానికి ప్రతీక... ఎఫ్ఎస్ఎస్-5కు కీల్ వేయడం భవిష్యత్తు సంకల్పానికి ప్రతీక.. కొత్త స్లిప్వే పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనమన్నారు. నేవీ వైవ్స్ వెలెనెస్ అసోసియేషన్ (ఎస్ డబ్ల్యూడబ్ల్యూఏ) అధ్యక్షురాలు లైలాస్వామినాదన్ సాంప్రదాయిక లాంఛనాలను పూర్తి చేసిన తరువాత, ఎపిఎసిఎస్-1ను ప్రారంభిం చారు. ఎఫ్ఎస్ఎస్-1కు 'సూర్య' అనే పేరును పెట్టారు. ఆహ్వానితుల హర్షధ్వానాల మధ్య ఈ నౌకను బంగాళాఖాతం జలాల్లో ప్రవేశపెట్టారు. ఈ నౌకకు రూపురేఖలను దిద్దడమే కాకుండా దీనిని హెచ్ఎస్ఎల్ నిర్మించింది. ఓడసరుకుతో పాటు ద్రవ రూప పదార్థాలను తీసుకువెళ్లే సామర్థ్యాన్ని 'సూర్య'కు జతపరిచారు. భారత నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో సుదూర సముద్ర కార్యకలాపాలను కొనసాగించేందుకు ఫ్లీట్ సపోర్ట్ షిప్లు కీలకంగా ఉపయోగపడనున్నా యని రక్షణ మంత్రి తెలిపారు. యుద్ధ నౌకలకు ఇంధనం, ఇతర ద్రవ పదార్థాలు, సరకు, నిర్వహణ సహకారం అందించడంతోపాటు సముద్రంలోనే అవసరమైన సేవలను కొనసాగించేందుకు ఇవి దోహదపడతాయన్నారు.'సూర్య' నౌకలో అధిక సామర్థ్యం కలిగిన సరకు, ద్రవ పదార్థాల నిల్వ సదుపాయాలు, ప్రథమ శ్రేణి నిర్వహణ వర్క్‌షాప్లు, మల్టీ రోల్ హెలికాప్టర్ల నిర్వహణకు హెలీకాప్టర్ డెక్, స్వీయ రక్షణ వ్యవస్థలు ఉంటాయని తెలిపారు. హెచ్ఎస్ఎల్ స్వదేశీ పరిజ్ఞానంతోనే ఈ నౌకలను నిర్మిస్తోంది.

### 45 వేల డీడబ్ల్యూటీ నౌకల నిర్మాణానికి..

ఆధునీకరించిన స్లిప్వే-4ను 45 వేల డీడబ్ల్యూటీ వరకు భారీ నౌకలను నిర్మించి, జలప్రవేశం చేయగలిగేలా విస్తరించి బలోపేతం చేశారు. స్లవ్వేలు-3, 4పై విస్తరించిన 300 టన్నుల గోలియత్ క్రేన్ భారీ నౌకా భాగాలను వేగంగా, కచ్చితంగా తరలించేందుకు ఉపయోగపడనుంది. మేక్ ఇన్ ఇండియా కింద ఎల్‌అండ్టీ జియోస్ట్రక్చర్, కోనెక్రేన్స్ సహకారంతో దీనిని రూపొందించారు. స్వయం సమృద్ధి సాధించడం తొలి అడుగేనని, ప్రపంచ స్థాయి పోటీతత్వమే తదుపరి లక్ష్యమని రాజ్నాథ్ సింగ్ అన్నారు. నాణ్యత, వ్యయం, సాంకేతికత, ఉత్పాదకం సకాలంలో నౌకల అందజేతలో ప్రపంచంలోని ప్రముఖ షిప్యార్డ లతో భారత సంస్థలు పోటీ పడాలని సూచించారు. హెచ్ఎస్ఎల్ రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, విశ్వవిద్యాలాయాలు, సాంకేతిక సంస్థలు, స్టార్టప్‌లను అనుసంధానించి సంపూర్ణ నౌకానిర్మాణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని అన్నారు. తూర్పు నౌకా దళ ప్రధాన కార్యాలయం, నేవల్ డాక్ యార్డ్, హెచ్ఎస్ఎల్, విశాఖప ట్నం పోర్టు వంటి కీలక సంస్థలు ఒకే నగరంలో ఉండటం విశాఖకు ప్రత్యేక బలమన్నారు. విశాఖపట్నాన్ని ప్రధాన మెరైన్ ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. మెరుగైన డిజైన్. వేగవంతమైన నిర్మాణం.. సకాలంలో సరఫరా.. సమర్థవంతమైన నిర్వహణ" లక్ష్యంగా హెచ్ఎస్ఎల్ హెచ్ ముందుకు సాగాలని రక్షణ మంత్రి సూచించారు. దేశీయ నౌకానిర్మాణాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరించి, స్నేహపూర్వక దేశాలకు నౌకలు, మరమ్మతు, నిర్వహణ, ఇంజినీరింగ్ సేవలు అందించే స్థాయికి భారతషిప్యార్డులు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న వారిలో నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ కృష్ణ స్వామినాడన్ రోడ్లు భవనాల శాఖమంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, విశాఖ ఎంపీ శ్రీభరత్ కుమార్, తూర్పు నౌకదళ వైస్ అడ్మిరల్ సంజయ్ జిల్లా, ఈస్టర్న్ శ్రీభరత్, రక్షణ ఉత్పత్తి కార్యదర్శి సంజీవ్ సీబోర్డుకు చెందిన కోస్తా తీర రక్షకదళ శాఖకీ చెందిన సీనియర్ అధికారులు ఉన్నారు.

SCHOOL OF

# EDU APPROACH

EDU APPROACH PROFESSIONALS PVT. LTD.

*Where Excellence Meets Innovation in Education!*

5 YEARS OF TRANSFORMING
ASPIRATIONS INTO ACHIEVEMENTS



# JEE | NEET | IIT FOUNDATION

## 2026 - 2027

**FOUNDATION TODAY, SUCCESS TOMORROW!**

**ADMISSIONS OPEN**
**NEW ONLINE BATCHES**
Expert Guidance. Concept Clarity.
Proven Results.




**YAMSANI SHIVA KUMAR**
Chairman & Chief Mentor – Physics
24+ Years of Excellence
in Teaching & Mentoring

LIVE ONLINE CLASSES | EXPERT FACULTY | WEEKLY TESTS | PERSONALIZED MENTORING | PERFORMANCE ANALYSIS

## JEE
MAINS & ADVANCED

### WE TEACH

**PHYSICS**
- Mechanics
- Thermodynamics
- Waves & Optics
- Electricity & Magnetism
- Modern Physics

**CHEMISTRY**
- Physical Chemistry
- Organic Chemistry
- Inorganic Chemistry

**MATHEMATICS**
- Algebra
- Calculus
- Coordinate Geometry
- Trigonometry
- Vector 3D
- Probability
- Sequence & Series
- Statistics

Concept Building
Problem Solving | PYQ Practice
Mock Tests | Doubt Sessions

## NEET

### WE TEACH

**PHYSICS**
- Mechanics
- Thermodynamics
- Waves & Optics
- Electricity & Magnetism
- Modern Physics

**CHEMISTRY**
- Physical Chemistry
- Organic Chemistry
- Inorganic Chemistry

**BIOLOGY**
- Botany (Class 11 & 12)
- Zoology (Class 11 & 12)
- Human Physiology
- Genetics & Evolution
- Plant Physiology
- Ecology & Environment

NCERT Based Teaching
Concept Clarity | NEET PYQs
Test Series | Doubt Solving

## IIT
FOUNDATION
CLASSES 6 – 10 (ALL BOARDS)

### WE TEACH

**MATHEMATICS**
- Number System
- Algebra
- Geometry
- Mensuration
- Data Handling
- Logical Reasoning

**SCIENCE**
- Physics Fundamentals
- Chemistry Basics
- Life Sciences
- Earth & Space
- Experiments & Activities

Strong Concepts
Regular Assessments | Olympiad
Foundation for JEE/NEET Success

**OUR PROMISE**
- Conceptual Learning
- Regular Tests & Analysis
- Result Oriented Approach
- Individual Attention
- Holistic Development

*Big Dreams.*
*Right Guidance.*
*Brighter Future.*

**Edu Approach Professionals Pvt. Ltd.**
+91 94904 55545
eduapproach@gmail.com
www.schoolofeduapproach.com

SCAN TO KNOW MORE

*TAKE THE RIGHT STEP TOWARDS YOUR DREAM!*
*We Guide. You Achieve.*

CALL / WHATSAPP NOW
**94904 55545**
WhatsApp for Enquiries

SCAN TO ENQUIRE

GUIDING MINDS | BUILDING FUTURES | CREATING POSSIBILITIES

# రాహుల్‌కు అబద్ధాలు అలవాటే

**ఈసీపై ఆయన ఆరోపణలు బాధ్యతారహితం**
**ఫామ్-6పై కాంగ్రెస్ మార్కు అబద్ధాల ప్రచారం**
**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 :** రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు చేసి, ప్రజల్లో అప నమ్మకం కలిగించడం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చట్టపర వాస్తవాలను తెలుసుకునేందుకు ప్రయత్నించకుండా.. ఏ ఆధారాల్లేకుండా కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఆరోపణలు ఆయన బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతున్నాయని, రాజ్యాంగ సంస్థలపై ఆయన అబద్ధాల ప్రచారం మరోమారు బట్టబయలైందని మంగళవారం ఓ ప్రకటనలో మండి పడ్డారు. రాజకీయ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడల్లా ఒక వివాదాన్ని సృష్టించి.. రాజ్యాంగ సంస్థలను అనుమానాల నీడలోకి నెట్టడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. 'సర్'పై నిరాధార ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఫామ్-6పైనా మరో అసత్య ప్రచారానికి తెర తీసిందని.. ఇదంతా కాంగ్రెస్ మార్కు అబద్ధాల ప్రచారంలో భాగమేనని ఎద్దేవా చేశారు.

'లోక్‌సభలో విపక్ష నేతగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వ్యక్తి కంటే.. రాజకీయ ఓటములను జీర్ణించుకోలేని నాయకుడి నిస్సహాయ, నిరాశా నిస్పృహలతో కూడిన ప్రవర్తనే రాహుల్‌లో ఎక్కువగా కనిపిస్తోంది' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముందు అసత్యాలను ప్రచారంలోకి తెచ్చి .. ప్రజల్లో అనుమానాలు సృష్టించడం, తర్వాత కోర్టులకెళ్లి క్షమాపణ చెప్పడం ఆయన మానసిక స్థితికి అద్దం పడుతోందన్నారు. 'ఇకనైనా కల్పిత కుట్రల వెనుక దాక్కోవడం మానుకోవాలి. రాహుల్ గాంధీ తన రాజకీయ వైఫల్యాలను నిజాయితీగా అంగీకరించాలి. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు పూర్తి బాధ్యత వహించాలి' అని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజా విశ్వాసాన్ని పొందలేకపోతే ఆ తప్పును ప్రజాస్వామ్య వ్యవస్థపై నెట్టడం సరికాదన్నారు. రాజకీయ వైఫల్యాలకు రాజ్యాంగ సంస్థలను బలి పశువులను చేయడం బాధ్యతాయుతమైన విపక్ష నేత లక్షణం కాదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలోనూ రాహుల్ పలు తప్పిదాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు.

### ఓటములు జీర్ణించుకోలేకే..: కె.లక్ష్మణ్

వరుస ఓటములను జీర్ణించుకోలేకే పసలేని ఆరోపణలతో ఈసీఐపై రాహుల్ గాంధీ ఎదురు దాడి చేస్తున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని అవమానించడం ప్రజాస్వామ్య పరిరక్షణ కాదని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసీఐని ఒక పోస్టాఫీసులా చూస్తున్న కాంగ్రెస్.. ఓటమి పాలైన ప్రతిసారీ చేసిన ఫిర్యాదుపై తమకు నచ్చిన సమాధానం వస్తుందని ఆశిస్తోందని, నచ్చిన జవాబు రాకుంటే పోస్ట్‌మ్యాన్‌ను దూషిస్తోందని ఎద్దేవా చేశారు.

# రాజ్యాంగం పట్టుకొని రాహుల్ ఉపన్యాసాలు

**తెలంగాణలో రేవంత్‌రెడ్డి అరాచక పాలన: కేటీఆర్**



ఢిల్లీలో రాజ్యాంగం పట్టుకొని రాహుల్‌గాంధీ.. ఉపన్యాసాలు దంచుతుండగా, తెలంగాణలో ఆయన తొత్తు రేవంత్‌రెడ్డి అరాచక పాలన సాగిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎవరిపైనైనా రాహుల్‌గాంధీ నిరాధార ఆరోపణలు చేయొచ్చు కానీ, ఆధారాలతో ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌ను జైలుకు పంపుతారా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అనుముల కుటుంబ అవినీతిని ఆధారాలతో ప్రశ్నించినందుకే క్రిశాంక్‌ను అరెస్టు చేయించారని ఆరోపించారు. గల్లీల్లో తిరుగుతూ 'ఓటు చోరీ' అని అరిచే రాహుల్.. తెలంగాణలో ఓటుకు నోటు సూత్రధారికే ముఖ్యమంత్రి కుర్చీ కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రేవంత్‌ను అదుపులో పెట్టాలని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం మానుకోవాలని రాహుల్‌కు సూచించారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్ మంజూరు

**హైదరాబాద్ :** మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగికదాడి, హత్యాయత్నం కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పర్‌పల్లి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25వేల చొప్పున ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని, ప్రతి ఆదివారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ విచారణాధికారి ఎదుట హాజరుకావాలనే షరతులతో మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 67రోజుల జైలు జీవితం అనంతరం ఉదయ్ బెయిల్‌పై విడుదలయ్యారు.

# ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం తగదు!

**ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్లు**
**మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం: హరీశ్**



**హైదరాబాద్, అక్టోబరు 6 :** హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఒకవైపు విద్యుత్ కోతలు, మరోవైపు బిల్లులు పెంచుతూ ప్రజలకు కాంగ్రెస్ సర్కార్ వాతలు పెడుతున్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం.. ట్రూ-అప్ చార్జీల పేరుతో రూ.5,420 కోట్ల భారం మోపేందుకు సిద్ధమైందని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన మొత్తాన్ని వినియోగదారుల నుంచే వసూ లు చేయడం సమంజసం కాదని, ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలను బాధ్యులను చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేగణేశ్ బిగాల, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ట్రూ-అప్ పేరుతో ప్రజలపై మోపే విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకొని చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మరో ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ చేసే పోరాటంలో కమ్యూనిస్టులు, విద్యుత్ ఉద్యోగులు, ప్రజలు కలిసిరావాలని హరీశ్‌రావు కోరారు.

### పదేండ్లలో విద్యుత్‌రంగం బలోపేతం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో విద్యుత్‌రంగాన్ని బలోపేతం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. సుమారు రూ.91 వేల కోట్లతో జెన్‌కో, ట్రాన్స్‌కోతోపాటు విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేశామని చెప్పారు. 400 కేవీ సబ్‌స్టేషన్లు 6 నుంచి 30కి, 220 కేవీ సబ్‌స్టేషన్లు 51 నుంచి 103కి, 132 కేవీ సబ్‌స్టేషన్లు 176 నుంచి 251కి పెంచామని వివరించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 నుంచి 19,450 మెగావాట్లకు పెంచి తెలంగాణను 'పవర్ ఫుల్ ' రాష్ట్రంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. కొత్తగూడెంలో 800, భద్రాద్రిలో 1,080, భూపాలపల్లిలో 600, యాదాద్రిలో 4వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లను నిర్మించామని తెలిపారు. థర్మల్‌లో 6,480 మెగావాట్లు, సోలార్‌లో 3,600 మెగావాట్ల సామర్థ్యాన్ని అదనంగా అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

### కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సంక్షోభం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక సబ్‌స్టేషన్ కూడా నిర్మించలేదని, ఒక మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా పెంచలేదని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో 24గంటల కరెంట్ ఉన్న రాష్ట్రంలో ఇప్పుడు కోతలు ఎందుకు వచ్చాయని నిలదీశారు. భద్రాద్రి, యాదాద్రి, సింగరేణి, కేటీపీఎస్ వంటి విద్యుత్ కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో ఎందుకు నడుపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర థర్మల్ విద్యుత్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 13,384 మెగావాట్లు కాగా, 8వేల మెగావాట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదని ఆరోపించారు. నైనీలో బొగ్గు ఉన్నా కమీషన్ల కోసం విదేశాల నుంచి అధిక ధరలకు బొగ్గు దిగుమతి చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ట్రాన్స్‌కోలో 26శాతం వాటాల విక్రయ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ట్రూ-అప్ చార్జీల కింద రూ.12,718.40 కోట్ల భారం మోపాలని ఈఆర్‌సీ సూచించినా ప్రజలపై భారం వేయడానికి కేసీఆర్ అనుమతించలేదని గుర్తుచేశారు. నాడు చంద్రబాబు అడ్డగోలుగా చార్జీలు పెంచి బషీర్‌బాగ్ కాల్పుల దాకా తెచ్చారని మండిపడ్డారు. అప్పుడు విద్యుత్ బిల్లులపై పోరాటం చేసిన కమ్యూనిస్టులు, ఇవాళ రేవంత్‌రెడ్డి చేసే పాపంలో పాల్పంచుకోవద్దని, బీఆర్‌ఎస్ చేసే పోరాటంలో కలిసి రావాలని కోరారు.

# భూ దందాలపై 10న పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

**కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల భూ కుంభకోణాలపై 200 కేస్ స్టడీస్ సిద్ధం చేశాం: ఏలేటి**

రాష్ట్రంలో జరుగుతున్న భూ దందాలపై ఈనెల 10న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పవర్‌-పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్లు బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలకు భూ కుంభకోణాలకు సంబంధించి 200 కేస్ స్టడీస్ తాలూకు నివేదిక సిద్ధం చేశామని తెలిపారు. తొలి విడతగా 10-15 కీలక కేస్ స్టడీలను, డాక్యుమెంటరీ ఆధారాలను బట్టబయలు చేస్తామని, అనంతరం రెండో విడత పీపీటీని నిర్వహిస్తామని మహేశ్వర్‌రెడ్డి వివ రించారు. భూ దోపిడీపై బీజేపీ చేపట్టనున్న భవిష్యత్తు కార్యాచరణను కూడా వెల్లడిస్తామని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి సర్వే నం. 1007లో వేల కోట్ల విలువైన ప్రైవేటు భూములను బినామీ కంపెనీలతో కబ్జా చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమిని కాజేయడానికి అధికార పార్టీ బినామీ కంపెనీ ప్రహరీ కట్టే దుస్సాహసానికి ఒడిగట్టిందని ఆరోపించారు.

# ఎలివేటెడ్ కారిడార్.. సర్కారు ఆమోదం!

**రూ.1090 కోట్లతో.. 4.3 కి.మీల మేర నిర్మాణం**
**కేఎన్‌ఆర్‌తో ఒప్పందం రద్దు.. డిపాజిట్లు వాపస్**

**హైదరాబాద్ సిటీ, :** హైదరాబాద్‌లోని జూబ్లీచెక్‌పోస్ట్ నుంచి ముఫకంజా కాలేజీ వరకు స్టీల్ ఎలివేటెడ్ కారిడార్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1కు అనుసంధాన ర్యాంపు నిర్మాణ పనుల ప్రారంభించే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. గతంలో కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు జంక్షన్లలో ప్రతిపాదించిన వంతెనలు, అండర్‌పాస్ నిర్మాణాల ప్రణాళికను రద్దు చేసి.. ప్రత్యామ్నాయంగా చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని ఆమోదిస్తూ స్టాండింగ్ కమిటీ పంపిన ప్రతిపాదనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు పనులను మేఘా ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించాలని నిర్ణయిస్తూ పురపాలక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ఎఫ్‌సీఎల్, టీవీ-9 జంక్షన్ల వద్ద వంతెన, అండర్‌పాస్ నిర్మాణ పనులను కేఎన్‌ఆర్ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో.. ఆ కాంట్రాక్టు రద్దు చేస్తూ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఉపసంహరించుకోవడంతో పాటు సదరు సంస్థకు డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించాలని నిర్ణయించింది. రూ.1090 కోట్ల అంచనా వ్యయంతో 4.3 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ప్రతిష్ఠాత్మక ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు ప్యాకేజీ-1గా.. ముఫకంజా ఫ్లై ఓవర్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1 అనుసంధాన ర్యాంపు పనులు ప్యాకేజీ-2గా ప్రతిపాదించారు.

# దోస్త్‌లో 2,13,671 మందికి ప్రవేశాలు

**ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీలో 82శాతం సీట్ల భర్తీ**

**హైదరాబాద్, అక్టోబరు 6 :** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ విద్యాసంవత్సరం మూడు విడతల సాధారణ కౌన్సెలింగ్‌తో పాటు రెండు ప్రత్యేక విడతలు, స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 784కాలేజీల్లో 4,42,450 సీట్లకు గాను, ఈసారి 2,13,671సీట్లు భర్తీ అయినట్లు ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ విడతలో 8,531 సీట్లు భర్తీ కావడం విశేషం. కోర్సుల వారీగా చూస్తే విద్యార్థులు ఎప్పటిలాగే బీకాం వైపే మొగ్గు చూపారు. అత్యధికంగా బీకాంలో 77,113 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది కొత్తగా ప్రారంభించిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుల్లో 370 సీట్లకు గాను 302 సీట్లు (82 శాతం) భర్తీ అయ్యాయి.

# కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడే సెస్‌లో రూ.32 కోట్ల అవినీతి

**ఎన్నికల ముందు ఆ ఫైళ్లన్నీ దగ్ధం**
**గల్ఫ్ కార్మికులకు గత సర్కార్ ఏం చేయలేదు**
**రాజన్న ఆలయాన్ని సిమెంట్‌తో ఎలా నిర్మిస్తారు?**
**కృష్ణ శిలలతోనే పునర్నిర్మించాలి**
**రేవంత్, మహేశ్‌గౌడ్‌ది ఇడుపుకాయితం జోడీ: కవిత**



**సిరిసిల్ల, అక్టోబరు 6 :** సిరిసిల్ల ప్రాంతంలోని కోఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీ లిమిటెడ్‌ను(సెస్) రద్దు చేయడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సెస్‌లో రూ.32కోట్ల మేర అవినీతి జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సరిగ్గా ఎన్నికలకు ముందు అందులో అగ్నిప్రమాదం జరిగి ఆ ఫైళ్లన్నీ కాలిపోయాయని, ఇలా చాలాచోట్ల ఆధారాలు మాయం చేశారని విమర్శించారు. సెస్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా వేములవాడలోని భీమేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు అందజేసిన కవిత.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చందుర్తి మండలం సనుగులలో అమరవీరుల యాది కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర ఉన్న వేములవాడ రాజన్న ఆలయాన్ని సిమెం ట్‌తో ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. వెయ్యేళ్లైనా చెక్కు చెదరకుండా ఉండే లా కృష్ణ శిలలతో ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయాన్ని పునర్నిర్మించాలని కోరారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండి కూడా ప్రసాద్ స్కీమ్‌లో వేములవాడ ఆలయాన్ని చేర్చలేదని ధ్వజమెత్తారు. యువ సామ్రాట్ అని చెప్పుకునే కేటీఆర్ నియోజకవర్గంలో ఉన్న జేఎన్టీయూ కాలేజీలో ల్యాబ్ లేక విద్యార్థులు జగిత్యాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో రుద్రంగి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని చెప్పిన హరీశ్.. పదేళ్లయినా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని దుయ్యబట్టారు. సిరిసిల్లలో సభ పెట్టి గాయిగాయి చేయడం తప్ప సీఎం చేసిందేముందని నిలదీశారు. సిరిసిల్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపిస్తే మంత్రిని చేస్తానని సీఎం చెప్పడంపై స్పందిస్తూ పదేళ్లుగా సిరిసిల్లకు మంత్రి లేరా?ముఖ్యమంత్రే సిరిసిల్లకు మంచి చేయలేరా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఒకటి మాట్లాడితే, టీపీసీసీ అధ్యక్షుడు ఇంకొకటి మాట్లాడతారని, వాళ్లను చూస్తే ఇడుపుకా యితం జోడీలా కనిపిస్తోందని ధ్వజమెత్తారు.

# కదం తొక్కిన విపక్షాలు!

**ఇండి కూటమి ఆధ్వర్యంలో ఎంపీల భారీ ర్యాలీ**

**పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం దిశగా 300 మంది ఎంపీల మార్చ్**

**సర్ రద్దు, సీఈసీ రాజీనామాకు డిమాండ్**

**మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత**

**బ్యారికేడ్లెక్కి జాతీయజెండాతో నిరసన**

**పోలీసులకు చిక్కకుండా 'ఆకాశవాణి'లోకి రాహుల్.. అక్కడే రాత్రి వరకు నిరసన**

**ఆయన వెంట ప్రియాంక, కాంగ్రెస్ ఎంపీలు**

**9 గంటల హైడ్రామా తర్వాత బలవంతంగా అదుపులోకి.. అనంతరం విడుదల**

**జ్ఞానేశ్ సాయంతో మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్ ఓట్ల చోరీ: రాహుల్**

**ఎంపీలను కలవడానికి అభ్యంతరమేంటని ప్రశ్న..**

**అపాయింట్‌మెంట్ కోరలేదన్న ఈసీ**





**న్యూఢిల్లీ :** దేశ రాజకీయాలను కుదిపేస్తున్న ఓట్ చోరీ వ్యవహారంపై విపక్షాలు కదం తొక్కాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ, ఇండి కూటమి ఎంపీలు చేపట్టిన నిరసనతో.. మంగళవారం ఢిల్లీ వీధుల్లో హైడ్రామా నడిచింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నేతృత్వంలో 300 మందికి పైగా ఎంపీలు (లోక్‌సభ, రాజ్యసభ) చేపట్టిన మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ కార్యక్రమానికి రాహుల్‌గాంధీ కేంద్ర బిందువుగా నిలిచారు. పార్లమెంట్ భవనం నుంచి ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇండి కూటమి ఎంపీల ర్యాలీ మొదలు కాగా, నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలోకి రాగానే పోలీసులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో విపక్ష ఎంపీలు అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ.. సేవ్ డెమోక్రసీ బ్యానర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వినూత్న నిరసనతో అందరి దృష్టిని ఆకర్షించారు. అక్కడున్న స్టీల్ బ్యారికేడ్‌లపైకి ఎక్కి నిలబడి త్రివర్ణ పతాకం ఊపుతూ నిరసన తెలిపారు.

విపక్ష ఎంపీలను బలవంతంగా అదుపులోకి తీసుకుని తరలిస్తుండగా ఇండియా కూటమి ఎంపీలు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు బస్సులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ తోపులాట, తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ, ప్రియాంక పోలీసుల వలయాన్ని దాటుకుని ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి కార్యాలయం) భవన ప్రాంగణంలోకి దూసుకుపోయారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లనీయాలని పట్టుబట్టారు. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి చెట్టు కింద కూర్చున్నారు. తమవెంట మొబైల్ టాయిలెట్లను సైతం తెచ్చుకున్నామని ప్రకటించారు. తమ నేతలు కూర్చునేందుకు, తినేందుకు చాపలు, తినుబండారాలను కార్యకర్తలు తెచ్చి ఇచ్చారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ సహా నిరసనకు దిగిన ఎంపీల్లో చాలా మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి బస్సుల్లో తరలించారు. ఆ తర్వాత విడిచి పెట్టగా.. వారందరూ మధ్యాహ్నానికి తిరిగి నిరసనలో వచ్చి చేరారు. రాహుల్, ప్రియాంకతోపాటు కాంగ్రెస్ ఎంపీలు ఆకాశవాణి భవనాన్ని వీడలేదు. దీంతో చివరికి 9 గంటల తర్వాత పోలీసులు రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ సహా ఇతర ఎంపీలను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాత్రి 10 గంటల తర్వాత వారిని విడుదల చేశారు. ఈ నిరసన మార్చ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ నుంచి అభిషేక్ బెనర్జీ, ఎన్సీపీ (శరద్ పవార్) నుంచి సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా సహా ఇండియా కూటమి ప్రముఖ నేతలు హాజరయ్యారు. అయితే, ఈ నిరసనకు ఇండియా బ్లాక్‌లో భాగమైన ఆప్, డీఎంకే ఎంపీలు దూరంగా ఉండగా.. కూటమిలో లేని బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎంపీలు పాల్గొని మద్దతు పలికారు. మల్లికార్జున ఖర్గే కొద్దిసేపటికే అనారోగ్యానికి గురికావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, ఆర్.రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్ తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫామ్‌లో చూపించే కటౌట్లను ప్రతిపక్ష ఎంపీలు ప్రదర్శించారు. ఇండియా కూటమి మార్చ్ నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీని పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను దారి మళ్లించారు "సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సాయంతో ఓటు చోరీ ద్వారా ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ దేశాన్ని హైజాక్ చేశారు. ఇది ముమ్మాటికీ దేశద్రోహమే" అని రాహుల్ ధ్వజమెత్తారు. వీరెవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని, భవిష్యత్తులో అందరిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. "కోట్లాది మంది ప్రజలకు మేము ప్రాతినిధ్యం వహిస్తున్నాము. ఎంపీలను ఎన్నికల కమిషనర్లను కలవనివ్వకపతే, ఇక ప్రజాస్వామ్యానికి అర్థమేముంది"అని రాహుల్ ప్రశ్నించారు. తర్వాత ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన పోస్టులో 'జ్ఞానేశ్ ఇక చాలు. రాజీనామా చేయడానికి ఇదే సరైన సమయం' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ మార్చ్‌లో 300 మందికిపైగా విపక్ష ఎంపీలు పాల్గొన్నట్లు ప్రకటించారు. "జ్ఞానేశ్ కుమార్... మోదీ, షాల చేతిలో కేవలం కీలుబొమ్మ మాత్రమే. ఓట్ల దొంగతనంలో జ్ఞానేశ్ కుమార్‌కు పాఠాలు నేర్పింది ఆ పెద్ద దొంగలే" అంటూ ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విపక్షాల నిరసనపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు దేశంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించింది. కష్టపడకుండానే రాహుల్ గాంధీని మరోసారి రాజకీయంగా పైకి తీసుకురావడానికి (రీలాంచ్ చేయడానికి) విఫలయత్నాలు చేస్తున్నాయని విమర్శించింది. ఎన్నికల్లో వరుస పరాజయాలపై తమ అసంతృప్తిని విపక్ష ఎంపీలు ఈ రూపంలో వ్యక్తం చేసున్నారని, రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.

### అపాయింట్‌మెంట్ అడగలేదు: ఈసీఐ

ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా తమ అపాయింట్‌మెంట్ కోరలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలతో భేటీల కోసం 2025లోనే ఈసీఐ ఒక స్పష్టమైన విధివిధానాన్ని (ప్రక్రియను) రూపొందించిందని గుర్తు చేసింది. దీని ప్రకారం.. ఏ పార్టీ లేదా కూటమి నేతలైనా సంఘాన్ని కలవాలంటే, తమ అధికారిక ప్రతినిధి ద్వారా ముందుగా సమయం కోరాలని.. ఇరువర్గాల అంగీకారంతో నిర్ణయించిన సమయంలో భేటీ జరగడం ఆనవాయితీ అని స్పష్టం చేసింది.

# విశాఖ నేవీపై హనీట్రాప్

**పాకిస్థాన్‌కు దేశ రక్షణ రహస్యాలు**

**కుట్రను ఛేదించిన ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్**

**ఇద్దరు అరెస్టు.. 18 మంది కోసం వేట**

**డబ్బు, ఇతర ప్రలోభాలతో సిబ్బందికి 'పాకిస్థాన్ ఇంటెలిజెన్స్' మహిళల వల**

**ఫేక్ ఖాతాలతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో పరిచయాలు**

**అందమైన యువతుల ఫొటోలతో రిక్వెస్టులు**

**ట్రాప్‌లో పడిన సిబ్బంది నుంచి కీలక వివరాలు**

**జలాంతర్గాముల సంఖ్య, ఇతర అంశాలపై ఆరా**

**'ఆపరేషన్ ఫైర్ వాల్'లో గుర్తించిన సీఐ సెల్**

**10 రాష్ట్రాల పరిధిలో 12 టీమ్‌ల సోదాలు**

**కోయంబత్తూర్, విశాఖలో ఇద్దరి అరెస్టు**

అమరావతి : రాష్ట్రంలో గూఢచారుల హనీట్రాప్ వ్యవహారం కలకలం రేపుతోంది. విశాఖ నేవీలో పనిచేస్తున్న ఉద్యోగులను ట్రాప్ చేసి, దేశానికి చెందిన కీలక రహస్యాలను పాకిస్థాన్‌కు చేర్చేందుకు జరిగిన కుట్రను ఏపీ కౌంటరు ఇంటెలిజెన్స్ (సీఐ సెల్) ఛేదించింది. సున్నితమైన సమాచారం రాబట్టేందుకు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పీఐవో)కు చెందిన మహిళలు వేసిన ఎత్తును చిత్తుచేశారు. 'ఆపరేషన్ ఫైర్ వాల్' పేరిట ఈ ఆపరేషన్‌ను నిర్వహించారు. మరికొందరు అనుమానితులపై కన్నేసి, పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ కుట్రలో 13 మంది నేవీ సిబ్బంది పాత్రను ఇప్పటివరకు పసిగట్టారు. అందులో.. విశాఖ నేవీలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఉద్యోగితో పాటు కాంట్రాక్టు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఏపీ పోలీసులు వెల్లడించిన సమాచారం మేరకు వివరాలివీ..

### ఫేక్ ఖాతాలతో వల..

పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ (పీఐవో) కోసం పనిచేస్తున్న జోషితా పాల్ ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పరచుకొని, అనంతరం వాట్సాప్ కమ్యూనికేషన్‌కు మార్చినట్లు సీఐ సెల్ గుర్తించింది. ముంబైలోని ఓ షిప్ బిల్డింగ్ కంపెనీలో ఉద్యోగినిగా తనను తాను పరిచయం చేసుకుంది. మరో పీఐవో అన్వి మెహతా తనను ఢిల్లీకి చెందిన సైకాలజిస్టుగా నేవీ సిబ్బందికి పరిచయం చేసుకుంది. వాయిస్, వీడియో కాల్స్ ద్వారా వారితో సన్నిహితంగా మెలిగినట్లు మన అధికారులు గుర్తించారు. ఈ ఇద్దరూ...భారత నేవీ రహస్యాల కోసం అందులో పనిచేసే సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో ఎరవేశారు. అందమైన యువతుల ఫొటోలతో నకిలీ పేర్లతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి, చాటింగ్ చేశారు. వాయిస్, వీడియో కాల్స్ ద్వారా సంబంధాలు కొనసాగించారు. ఆ తర్వాత వాట్సాప్ కమ్యూనికేషన్ తమ పరిధిలోకి తీసుకుని రక్షణ రంగానికి సంబంధించిన కీలక సమాచారం రాబట్టేందుకు ప్రయత్నించారు. నౌకల సంఖ్య, జలాంతర్గాముల కదలికలు, కమాండింగ్ ఆఫీసర్ల వివరాలు, ఫొటోలు ఇతర వివరాలను జోషితా పాల్ ఆరా తీసేదని, సీఐ సెల్ గుర్తించింది. ప్రతిఫలంగా డబ్బులు ఇస్తామని ప్రలోభ పెట్టేదని కనుగొన్నారు. దేశ రక్షణకు సబంధించిన సున్నితమైన సమాచారాన్ని కోరడంతో పాటు వీడియో కాల్ ద్వారా నేవీ స్థావరాలు, నౌకలు, జలాంతర్గాముల్లోని సున్నిత ప్రాంతాలు చూపించాలని అన్వి మెహతా కోరింది. ఓటీపీలతో పాకిస్థాన్ వాట్సాప్ ఖాతాలను యాక్టివేట్ చేసి, మన దేశ రక్షణ సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేసింది. క్రిప్టో కరెన్సీ ద్వారా డబ్బులు ఇస్తానంటూ ఆశ చూపి, హనీట్రాప్ వేసినట్లు ఏపీ సీఐ సెల్ గుర్తించింది. ఆ మహిళలు ఇద్దరూ పాకిస్థాన్ గూఢచారులని, ఆ దేశంలోనే ఉన్నట్లు గుర్తించింది.

### ఎలా గుర్తించారు?

భారత రక్షణ వ్యవస్థకు చెందిన సున్నితమైన, రహస్య సమాచారాన్ని సేకరించేందుకు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అపరేటివ్స్. మహిళల పేర్లతో హనీట్రాప్ వల విసురుతున్నట్లు ఏపీ సీఐ సెల్ గుర్తించింది. నేవీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఫేక్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా పరిచయం పెంచుకుని, ఆ తర్వాత వాట్సాప్ ఖాతాకు కమ్యూనికేషన్ మార్చి సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మన అధికారులు గుర్తించారు. విశాఖ నేవీలో పనిచేస్తున్న ప్రదీప్ ముఖర్జీ అనే బెంగాలీ ఈ మహిళల ట్రాప్‌లో పడినట్లు పసిగట్టారు. అక్కడి నేవీ, రక్షణ సంస్థల వ్యూహాత్మక ప్రాంతాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ మార్గాల్లో 'పీఐవో'కు చేరవేస్తున్నట్లు సెప్టెంబరు 2న గుర్తించారు. వెంటనే బీఎన్‌ఎస్, ఉపా సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, గోవా, ఢిల్లీ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, బీహార్‌లకు 12 బృందాలను పంపారు. ఆయా రాష్ట్రాల్లోని యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసులు, నేవీ అధికారులతో కలిసి 'ఆపరేషన్ ఫైర్ వాల్ 2026' పేరుతో 18 మంది అనుమానితులను విచారించారు. అందులో 13మంది పాత్రను గుర్తించారు. ఈ క్రమంలో విశాఖ నేవీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పని చేస్తున్న అన్నం సాయి వరప్రసాద్‌ను అరెస్టు చేశారు. పాక్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేసి ప్రతిఫలంగా నగదు తీసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. విశాఖ నేవీ బేస్‌లో పనిచేస్తున్న ప్రదీప్ ముఖర్జీని తమిళనాడులోని కొయంబత్తూరులో అరెస్టు చేశారు.

పీఐవోలకు వాట్సాప్ ఖాతా యాక్టివేషన్ కోసం ఓటీపీ అందించడం, పీఐవోలతో కమ్యూనికేషన్ కొనసాగించడం, దేశ రక్షణకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని చేరవేయడంలో ఆయన పాత్ర ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నౌకలు, జలాంతర్గాముల కదలికల ఫొటోలు, వీడియోల కోసం 'పీఐవో' మహిళలు పెట్టిన ప్రలోభాలకు గురైనట్లు ఆధారాలు సేకరించారు. కోయంబత్తూరులో ఆచూకీ గుర్తించి స్థానిక కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. అరెస్టుల సమయంలో స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలు, కమ్యూనికేషన్ వివరాలు విశ్లేషిస్తున్నామని సీఐ సెల్ అధికారులు తెలిపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో మరిన్ని వివరాలను తగిన సమయంలో వెల్లడిస్తామని చెప్పారు.

# సుప్రీం జడ్జిగా అపరేశ్ సింగ్ ప్రమాణం

**గుజరాత్, ఢిల్లీ సీజేలు కూడా..**

**ప్రమాణ స్వీకారం చేయించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**37కు చేరిన సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య**

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు కొత్తగా ఎంపికైన ముగ్గురు న్యాయమూర్తులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు కొత్త బ్లాక్ ఆడిటోరియంలో మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వీరిచే ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ సునీతా అగర్వాల్ నియామకంతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు చేరింది. సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఈ నియామకాలు జరిగాయి. ఈ ముగ్గురి రాకతో సుప్రీంకోర్టులో ప్రస్తుతం సేవలందిస్తున్న మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీంకోర్టు సవరణ చట్టం ప్రకారం సీజేఐతో కలిపి సుప్రీంకోర్టులో మంజూరైన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, కేవలం ఒకే ఒక్క పోస్టు ఖాళీగా ఉంది.

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల వర్షం

**కీవ్ :** చమురు కేంద్రాలపై దాడే లక్ష్యంగా రష్యాలోని పలు ప్రాంతాలతో పాటు ఆక్రమిత క్రిమియా ద్వీపకల్పం, అజోవ్ సముద్రం ఏరియాలపై ఉక్రెయిన్ సోమవారం రాత్రి డ్రోన్ల వర్షం కురిపించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన దాదాపు 900 డ్రోన్లను తమ దళాలు కూల్చివేశాయని రష్యా వెల్లడించింది. ఈ డ్రోన్ దాడిలో మాస్కో రీజియన్‌లోని ఇంధన డిపో ఒకటి మంటల్లో చిక్కుకుందని, ఇద్దరు మరణించారని తెలుస్తోంది.

# సౌదీలోని రెండు ఎయిర్‌పోర్టులపై హుతీల దాడులు

**న్యూఢిల్లీ:** హుతీలు తమ దేశంలోని రెండు ఎయిర్‌పోర్టులు జాజన్, నజ్రాన్ ఎయిర్‌పోర్టులపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశారని, ఈ దాడుల వల్ల ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారని సౌదీ అరేబియా మంగళవారం ప్రకటించింది. ఈ రెండు ఎయిర్‌పోర్టులు యెమెన్ సరిహద్దులకు దగ్గర్లో ఉన్నాయని పేర్కొంది. మరోవైపు, యెమెన్‌లో హుతీలు, ప్రభుత్వ బలగాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. బాబ్-ఎల్-మాండేబ్ జలసంధిలో కీలకమైన పోర్టు సిటీ మోకాను, అలాగే అల్-తుర్బా పట్టణాన్ని హుతీల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు యెమెన్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ ప్రకటనను హుతీలు ఖండించారు.

# హోర్ముజ్‌లో నౌకపై క్షిపణి దాడి

**11 మంది భారతీయులకు గాయాలు**

**న్యూఢిల్లీ :** పనామా పతాకంతో ఉన్న వాణిజ్య నౌకపై మంగళవారం ఉదయం హోర్ముజ్ జలసంధిలో క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో 11 మంది భారతీయ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. "వాణిజ్య నౌకలు, నౌకా సిబ్బంది, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులకు ముగింపు పలకాలి. అదేవిధంగా అంతర్జాతీయ జలమార్గంలో పూర్వస్థితిని పునరుద్ధరించాలి." అని విదేశాంగ శాఖ పేర్కొంది. 'ఎమ్.టీ. ఆన్ పీస్'.. వాణిజ్య నౌకపై దాడి జరిగిన సమయంలో 19 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో 17 మంది భారతీయులు ఉన్నారని కేంద్రం తెలిపింది. వీరిలో 11మంది గాయపడ్డారని పేర్కొంది.

# 40 మంది అమెరికా పౌరసత్వాలు రద్దు

**వారిలో ఒకరు భారతీయుడు**

**వేలిముద్రలతో దొరికిపోయిన బల్వీందర్ సింగ్**

**వాస్తవాలు దాచిపెట్టడంతో అమెరికా ప్రభుత్వం చర్యలు**

**వాషింగ్టన్ :** ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా అమెరికా ప్రభుత్వం 40 మంది విదేశీయులకు ఇచ్చిన పౌరసత్వాలను రద్దు చేసింది. వీరిలో ఒకరు భారతీయుడు ఉన్నారు. మిగిలిన వారు నేపాల్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, మెక్సికో, చైనా, కంబోడియా తదితర దేశాల వారు ఉన్నారు. హత్యల వంటి ఘోరమైన నేరాలు చేయడం, విదేశాలకు ఏజెంట్లుగా పనిచేసి దేశ రహస్యాలను విక్రయించడం, దివ్యాంగుడిపై తీవ్రమైన లైంగిక దాడి చేయడం వంటి ఆరోపణలు కోర్టుల్లో రుజువు కావడంతో ఈ చర్య తీసుకొంది. వారికి పౌరసత్వాన్ని కల్పిస్తూ ఇచ్చిన న్యాచురలైజేషన్ సర్టిఫికెట్లను రద్దు చేసింది. వారిపై 'డీ-న్యాచురలైజేషన్' చర్య తీసుకున్నట్టు ప్రకటించింది. తప్పుడు మార్గాల ద్వారా పౌరసత్వం పొందడంతో కాలిఫోర్నియాకు చెందిన బల్వీందర్ సింగ్‌పై ఈ చర్య తీసుకున్నట్టు అసిస్టెంట్ అటార్నీజనరల్ బ్రెట్ ఎ షుమేట్ సోమవారం చెప్పారు. బల్వీందర్ తొలుత 1992లో ఇమ్మిగ్రేషన్ దరఖాస్తును సమర్పించాడు. వాస్తవాలను దాచిపెట్టి 2003లో మరో పేరుతో దరఖాస్తు ఇచ్చి పర్మినెంట్ రెసిడెంట్ హోదాను సంపాదించాడు. రెండో దరఖాస్తు ఆధారంగా ఆయనకు 2009లో అమెరికా పౌరసత్వం లభించింది. వేలిముద్రలను తనిఖీ చేసినప్పుడు రెండు దరఖాస్తులు ఒకటే అని తేలాయి. దాంతో తప్పుడు సమాచారం ఇచ్చి పౌరసత్వం పొందడం, నైతికల విలువలు లేవన్న ఆరోపణతో ఆయన సర్టిఫికెట్‌ను రద్దు చేసింది. అమెరికా నేవీలో పనిచేసినప్పటికీ పుట్టిన దేశమైన చైనాకు రహస్యాలను విక్రయించాడన్న నేరంపై జించావో వీ పౌరసత్వాన్ని రద్దు చేసింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డా ఆ నేరాన్ని దాచి పెట్టినందుకు ఓ మహిళ పౌరసత్వం రద్దయింది.

# వాయుసేన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్



**న్యూఢిల్లీ :** భారత వాయుసేన నూతన అధిపతి (ఎయిర్ చీఫ్ మార్షల్)గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుత అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండడంతో అదే రోజు మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంతవరకు వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్ వాయుసేనకు 29వ అధిపతిగా వ్యవహరించనున్నారు. యుద్ధ విమానాల పైలట్‌గా నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన ఆపరేషన్ సిందూర్‌లో వాయుసేనను నడిపించారు. తేలికపాటి యుద్ధ విమానాలైన తేజస్ తయారీలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1966 డిసెంబరు 9న జన్మించిన ఆయన 1986 డిసెంబరు 6న వాయుసేన యుద్ధ విభాగంలో చేరారు. మొత్తం 3,500 గంటల పాటు యుద్ధ విమానాలను నడిపారు. శిక్షకుడిగానూ గుర్తింపు పొందారు. యుద్ధ విమానాలైన మిరాజ్-2000, మిగ్, కిరణ్, జాగ్వార్, ఐఎల్-78, హాక్, తేజస్ అన్నింటినీ నడిపారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్‌ల్లో పాలుపంచుకున్నారు. 2006లో వాయుసేనా మెడల్, 2011లో విశిష్ట సేవా మెడల్, 2023లో అతి విశిష్ట సేవా మెడల్, 2026లో పరమ విశిష్ట సేవా మెడల్‌లను అందుకున్నారు.

మానేరు
జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 7 అక్టోబర్ 2026


# నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్ రీఎంట్రీ

## న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్ల ఎంపిక




న్యూజిలాండ్ పర్యటన కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మంగళవారం టీ20, ఇండియా-ఎ జట్లను ప్రకటించింది. ఈ ఎంపికలో పలు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ టీ20 జట్టులోకి పునరాగమనం చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మరోవైపు, స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు ఇండియా-ఎ జట్టులో స్థానం కల్పించారు.

ఈ పర్యటనలో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టుకు యువ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తెలుగు తేజం తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. గాయం కారణంగా ఏషియన్ గేమ్స్‌కు దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్ వంటి యువ ఆటగాళ్లకు సెలక్టర్లు అవకాశమిచ్చారు.

చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి అజిత్ అగార్కర్ వైదొలిగిన తర్వాత, తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఈ జట్లను ఎంపిక చేయడం గమనార్హం.

### భారత టీ20 జట్టు

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్) తిలక్ వర్మ (వైస్ కెప్టెన్) అభిషేక్ శర్మ సంజూ శాంసన్ (వికెట్ కీపర్) వైభవ్ సూర్యవంశీ ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్) అక్షర్ పటేల్ శివమ్ దూబె నితీశ్ కుమార్ రెడ్డి నమన్ ధీర్ ప్రిన్స్ యాదవ్ మయాంక్ యాదవ్ అర్ష్‌దీప్ సింగ్ భువనేశ్వర్ కుమార్ వరుణ్ చక్రవర్తి కుల్దీప్ యాదవ్

### ఇండియా-ఎ మ్యాచ్‌ల షెడ్యూల్

మొదటి మ్యాచ్: అక్టోబర్ 24-27, లింకన్
రెండో మ్యాచ్: అక్టోబర్ 31 - నవంబర్ 3, క్రైస్ట్‌చర్చ్
మూడో మ్యాచ్: నవంబర్ 7-10, లింకన్

కాగా, టీ20 సిరీస్ ముగిశాక ఐదు వన్డేలు, రెండు టెస్టుల సిరీస్‌లు కూడా జరగనున్నాయి. ఆ జట్లను త్వరలో ప్రకటిస్తామని బీసీసీఐ వెల్లడించింది.

# శ్రేయస్ శతక్కొట్టుడు

## 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఊదేసిన టీమిండియా




వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధిర్ 3 వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది. ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.

# కిసాన్ మేళాకు రైతులు తరలిరావాలి



సిద్దిపేట, అక్టోబర్ 6, జనతా న్యూస్: సిద్దిపేటలో బుధవారం నిర్వహించనున్న కిసాన్ మేళాకు జిల్లా రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమవతి పిలుపునిచ్చారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని వీఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ మేళా నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ప్రదర్శనలు, నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, రైతుల విజయగాథలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పంటల సాగు, సమస్యలపై సూచనలు అందించనున్నట్లు తెలిపారు. భోజన విరామం అనంతరం సాయంత్రం 5 గంటల వరకు సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులు తమ పంట సమస్యలపై సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వెయ్యికి పైగా రైతులు పాల్గొని మేళా ద్వారా లబ్ధి పొందేలా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు చేపడుతున్నారని జిల్లా వ్యవసాయాధికారి జె. స్వరూప రాణి తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేలా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# యూపీహెచ్‌సీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



జనతా న్యూస్, కరీంనగర్: నగర ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) భవనాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం ఆయన నగరంలోని కట్టారాంపూర్, సప్తగిరి కాలనీల్లో నిర్మిస్తున్న యూపీహెచ్‌సీ భవనాలను పరిశీలించారు. ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. యూపీహెచ్‌సీ భవనాల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఇండియా కూటమి గర్జన

### ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ





జనతా న్యూస్, కరీంనగర్: ప్రజాస్వామ్య పరిరక్షణ వారంలో భాగంగా ఓట్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని, ఎన్నికల ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం బీజేపీకి అనుబంధ విభాగంగా మారిందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అణగారిన వర్గాలకు చెందిన ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ప్రతిష్ఠను కాపాడాలని, సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తక్షణమే తొలగించి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఇండియా కూటమి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఈసీని బర్తరఫ్ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపు అంశంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్ల తొలగింపు కుట్రను అడ్డుకుంటామని అన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు అంబటి జోజిరెడ్డి రాహుల్‌గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. అనంతరం సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఇండియా కూటమి నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐఎంఎల్ తదితర భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనలో భాగంగా మోదీ, అమిత్‌షా, జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

# అలుగునూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'అంగన్ మిలన్ సేవ'





కరీంనగర్, జనతా న్యూస్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా మంగళవారం అలుగునూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్ మిలన్ సేవ-అంగన్‌వాడీ ఉత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంక్షేమం, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు అమలు చేస్తున్న పథకాలు ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. చిన్నారుల సంరక్షణలో సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ లతను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు చిందం అంజి, అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

### తిమ్మాపూర్ మండలంలో ఘనంగా 'అంగన్ మిలన్ సేవ'

తిమ్మాపూర్, జనతా న్యూస్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా తిమ్మాపూర్ మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అంగన్ మిలన్ సేవ--అంగన్‌వాడీ ఉత్సవ్' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి టీచర్లు, ఆయాలను సన్మానించి చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

### రామకృష్ణ కాలనీలో..

అంగన్‌వాడీ టీచర్లు గంగు సునీత, ఫరీదా, ఆయాలు రొడ్డ కనకవ్వ, మునిగంటి కనకలక్ష్మిలను శాలువాలతో సన్మానించారు. బీజేపీ మాజీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి టీచర్లు, ఆయాలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు కోతి రాజు, రేగూరి సుగుణాకర్, వేల్పుల ఓదయ్య, శాబోలు గణేష్, హెచ్‌ఎంలు మహేష్, సత్యనారాయణ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

### మక్తపల్లిలో..

మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు చింతం లక్ష్మణ్, ప్రదీప్‌రెడ్డి మక్తపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్ నిర్మలను సన్మానించి ఆమె సేవలను అభినందించారు.

### రామ హనుమాన్ నగర్‌లో..

స్థానిక బీజేపీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం వివరాలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ నందికొండ హైమావతిని సన్మానించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బూట్ల శ్రీనివాస్, సర్పంచ్ పిస్క సౌజన్య, ఉప సర్పంచ్ అందే శేఖర్, వార్డు సభ్యుడు ఉప్పులేటి ప్రవీణ్ తదితరులు పాల్గొని పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

### గొల్లపల్లిలో..

గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించి టీచర్ పాశం సరోజన, ఆయా కర్ణ రాజేశ్వరిలను సన్మానించారు. కేంద్రానికి ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని టీచర్లు కోరగా త్వరలో సమకూర్చుతామని నాయకులు హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అరటిపండ్లు పంపిణీ చేశారు.

### తిమ్మాపూర్‌లో..

తిమ్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు రామిడి మహేందర్‌రెడ్డి, జక్కోజు అనిల్ సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానించి చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.

# కోరుట్లలో రవాణా శాఖ యూనిట్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక తనిఖీ




కోరుట్ల, జనతా న్యూస్: జగిత్యాల జిల్లా కోరుట్లలోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు, సిబ్బంది పనితీరును అధికారులు పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలు లోపాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఎంవీఐ పర్యవేక్షణ లేకుండానే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అలాగే అధికారిక సేవల సమయంలో సిబ్బంది ద్వారా ఏజెంట్ల సహాయంతో ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్లు స్వేచ్ఛగా తిరుగుతూ సిబ్బందితో వ్యవహరిస్తున్నట్లు, కార్యాలయ రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని అధికారులు గుర్తించారు. సిబ్బంది విధుల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడాన్ని కూడా పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రదేశం రవాణా శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని, డ్రైవింగ్ ట్రాక్‌లో అవసరమైన సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. గుర్తించిన లోపాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుని, తదుపరి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐలు తిరుపతి, ప్రేమ్‌కుమార్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వం

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**



బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 65 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 41 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు, 12 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం పేదలు సంవత్సరాల తరబడి ఎదురుచూశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్య ఖర్చులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, భూకబ్జాలకు పాల్పడిందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఫామ్‌హౌస్ సంస్కృతిని తీసుకువచ్చిందని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హామీలను ప్రజలు గమనించి, మళ్లీ బీఆర్ఎస్‌ను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి పోచయ్య, మాజీ అధ్యక్షుడు మ-ఖిస రత్నాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 13-ఎల్ కాలువను రీడిజైన్ చేయాలి

**అధికారులను కోరిన బాధిత రైతులు**

**భూమి, నివాస స్థలాలు కోల్పోతామని ఆవేదన**



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పట్టణ శివారులో నిర్మించతలపెట్టిన 13 ఎల్ కాలువను పునఃసమీక్షించి, రీడిజైన్ చేయాలని బాధిత రైతులు అధికారులను డిమాండ్ చేశారు.కాలువ నిర్మాణం కోసం భూముల సర్వే నిర్వహించేందుకు మంగళవారం ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ లక్ష్మారెడ్డి ఇక్కడికి రావడంతో రైతులు వారిని కలిసి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కాలువ పరిధిలో ఎక్కువగా చిన్నచిన్న కమతాలు కలిగిన నిరుపేద రైతుల భూములతో పాటు, ఇళ్ల స్థలాలు కూడా ఉన్నాయని, కాలువ తవ్వితే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తవ్విన కాలువల ద్వారా నీరు సక్రమంగా రాక పూడుకుపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రతిపాదనను మార్చి, నివాస స్థలాలు, పేద రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా, ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ఒక ప్రార్థనా మందిరం (చర్చి) కూడా పూర్తిగా తొలగించాల్సి వస్తోందని తెలిపారు.రైతులు, స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాలువ డిజైన్‌లో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధిత రైతులు మరియాల రాజిరెడ్డి, కొరిమి పితాంబరం, జాల జ్యోతి కుమార్, జాల లక్ష్మయ్య, ఎస్. కోటేశ్వరరావు, బొజ్జ హరీష్, బొల్లి శ్రీనివాస్, గుర్రాల అరుణ, కూతాటి విజయభాస్కర్, ఇల్లందుల తిరుపతి, గొర్ల బాలయ్య, ఎం. కుమారస్వామిలు తహసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

# బతుకమ్మ టెండరును రద్దు చేసి.. వెంటనే రీ టెండర్ నిర్వహించాలి

**మున్సిపల్ అధికారులకు ప్రజల సొమ్ముపై పట్టింపులేదు**

**టెంట్లు, మైకులకే పదిహేను లక్షల టెండరా?**

**నిధుల దుర్వినియోగంపై పోరాటం తప్పదు**

**బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జునరెడ్డి**



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పురపాలక సంఘం పరిధిలో బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పేరిట నిర్వహించిన టెండరును వెంటనే రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా రీ టెండర్ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు.హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గానికి, అధికారులకు ప్రజల సొమ్ము పట్ల కొంచెమైనా బాధ్యత లేకుండా పోయిందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఇంద్రాల సారయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతీ ఏటా బతుకమ్మ వేడుకల పేరు చెప్పి భారీ మొత్తంలో టెండర్లు కేటాయిస్తూ ప్రజల పన్నుల సొమ్మును నీళ్లలా వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది కూడా బతుకమ్మ ఏర్పాట్ల కోసం రూ.15 లక్షలతో టెండర్ నిర్వహించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.బతుకమ్మ వేడుకలు జరిగే ఎల్లమ్మ చెరువు కట్టను ఇప్పటికే మినీ ట్యాంక్‌బండ్ తరహాలో సుందరీకరించారని అన్నారు.శోభాయమానమైన లైటింగ్, సీసీ రోడ్ల నిర్మాణం కూడా పూర్తయిందని.. అంతా సిద్ధంగా ఉన్నప్పుడు మున్సిపల్ అధికారులు ఇంకా ఏ రకమైన ఏర్పాట్లు చేస్తారో సమాధానం చెప్పాలని పశ్నించారు. కేవలం టెంట్లు, మైక్ సెట్ల కోసమే పదిహేను లక్షల రూపాయల టెండర్ పెట్టారా అని మల్లికార్జునరెడ్డి నిలదీశారు. ఈ టెండర్ కేటాయింపులు చూస్తుంటే ప్రజల సౌకర్యాల కోసం కాకుండా, ఎవరి జేబులు నింపడానికో.. పలహారాల పంపిణీ కోసమో చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు.ప్రజాధనాన్ని కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల పురపాలక సంఘం ఆదాయానికి తీవ్ర గండి పడుతోందని ఆరోపించారు. వచ్చిన రాబడిని అభివృద్ధి పనులకు కాకుండా, ఇలాంటి అనవసరపు ఖర్చులతో వృథా చేయడం సరికాదన్నారు.మున్సిపల్ పాలకవర్గానికి నిజంగా ప్రజల సొమ్ముపై పట్టింపు ఉంటే, తక్షణమే ఈ బతుకమ్మ టెండరును రద్దు చేయాలని.. కొత్తగా రీ టెండర్ పిలవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారుల తీరుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

# బెజ్జంకి మండల యాదవ సంఘం ఆత్మీయ సమ్మేళనం

బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: బెజ్జంకి మండల కేంద్రంలోని సత్య అర్జున ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 8వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు బెజ్జంకి మండల యాదవ సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మండల యాదవ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్య యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని యాదవ కుల బంధువులు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బండి రమేష్, బండి చంద్రయ్య, దొంతరవేణి ఓదెలు, రొడ్డ మల్లేశం, మేడుదుల బాలయ్య, సీత లక్ష్మణ్, కల్లూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సుకు బయలుదేరిన నాయకులు



బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ ప్రతినిధుల జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు బెజ్జంకి మండలానికి చెందిన ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సామాజిక న్యాయం, హక్కుల సాధనపై సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి చింతకింది పరశురాములు, మండల అధ్యక్షుడు వడ్లూరి పరశురాములు, జేరిపోతుల మధు, బోనగిరి చంద్రయ్య, శేషుకుమార్, సురేష్, మహంకాళి ప్రవీణ్, బాబు రమేష్, కొంకటి రాములు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా దేవక్కపల్లి గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గుర్రం ఉమా, ఆయా స్వరూపక గీత, పారిశుద్ధ్య కార్మికులు తోటపల్లి రాయమల్లు, జనగాం వనజలను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందిని గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరెళ్ల వెంకటలక్ష్మి-రాజయ్య, బీజేపీ మండల కార్యదర్శి బీరం చంద్రారెడ్డి, బూత్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, రావుల బాల్రెడ్డి, సురుపాక లక్ష్మణ్, కాసం సతీష్ రెడ్డి, రావుల రాజిరెడ్డి, కొమ్ము మల్లేశం, కొమ్ము నాగరాజు, వడ్లకొండ శంకరయ్య, రావుల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్యలు.. రెండు వాహనాలు స్వాధీనం



బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు మహేంద్ర బొలెరో పికప్ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్--1 రోడ్డుపై గాగిల్లాపూర్ గ్రామ బస్‌స్టేజ్ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాహనాల్లో భారీగా ఇసుక లోడ్ చేసి ఉండగా, ఇసుక రవాణాకు సంబంధించిన ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే పత్రాలు వాహనదారులు చూపించలేదని పోలీసులు తెలిపారు. విచారణలో చిగురుమామిడి మండలం ఓబులాపూర్ గ్రామ పరిధిలోని ఇందుర్తి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో ఇసుకతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## బతుకమ్మ ఘాట్ వద్ద సకల సౌకర్యాలు

**ఘాట్ పరిసరాలను పరిశీలించిన సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి**

**బ్లేడ్ ట్రాక్టర్‌తో మైదానం చదును.. విద్యుత్ లైట్లు, విగ్రహ ఏర్పాటు పనులు**

**మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు**





చిగురుమామిడి, జనత న్యూస్:బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మండలంలోని సుందరగిరి గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారం స్థానిక గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలసి బతుకమ్మ ఘాట్ పరిసరాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పండుగ వేళ బతుకమ్మ ఆడటానికి వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ మైదానాన్ని బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష మాట్లాడుతూ.. వేడుకలకు వచ్చే మహిళలకు అన్ని విధాలా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. రాత్రి వేళల్లో ఇబ్బంది లేకుండా విద్యుత్ లైట్ల ఏర్పాటుతో పాటు బతుకమ్మ విగ్రహ ఏర్పాటు పనులను కూడా పరిశీలించినట్లు చెప్పారు. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామంలోని 2వ వార్డు నుంచి బతుకమ్మ ఘాట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నామని గుర్తుచేశారు. బతుకమ్మ పండుగను మహిళలంతా సంతోషంగా, వైభవంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడబోయిన రాజు, వార్డు సభ్యులు మంథని ప్రియాంక,గిరబోయిన రాజు,శ్రీమూర్తి శ్రీనివాస్,వంతడ్పుల దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



జనతా న్యూస్, కరీంనగర్: క్రీడలు విద్యార్థుల్లో ఆసక్తి, ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, వనరులను ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు అందిస్తున్నాయని తెలిపారు.

అండర్-14 బాలుర హాకీ: డి. శివన్ రెడ్డి, ఏ. రితిక్ పటేల్, వి. రేవంత్. పోటీలు రంగారెడ్డిలో నిర్వహించనున్నారు.

అండర్-14 బాలికల హాకీ: జోయా, ఏ. నైకా రెడ్డి, వి. లక్ష్మీ ప్రసన్న. పోటీలు కామారెడ్డిలో నిర్వహించనున్నారు.

అండర్-17 బాలుర హాకీ: సీహెచ్. జయంత్. పోటీలు జోగులాంబ గద్వాల్ జిల్లాలో నిర్వహించనున్నారు. ఎంపికైన విద్యార్థులను డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దసరా వేళ.. మహాశక్తి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి

**11 నుంచి 20 వరకు నవరాత్రి ఉత్సవాలు.. ప్రత్యేక పూజలు, అన్నదానం, భక్తి దాండియా**





కరీంనగర్, జనతా న్యూస్: దసరా నవరాత్రి ఉత్సవాలకు కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయం ముస్తాబవుతోంది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సంప్రదాయ వైభవాన్ని అందించేలా ప్రత్యేక కార్యక్రమాలను సిద్ధం చేస్తున్నారు. 2010 జూన్ 17న శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించిన శ్రీ మహాశక్తి దేవాలయం 16 ఏళ్లలో భక్తుల విశ్వాస క్షేత్రంగా ఎదిగింది. తొలినాళ్లలో కొద్దిమంది భక్తులతో ప్రారంభమైన అమ్మవారి దర్శనం ప్రస్తుతం వేలాది మంది భక్తులు తరలివచ్చే స్థాయికి చేరింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భవానీ దీక్షాపరులతో ఆలయం సందడిగా మారనుంది. గతంలో కొద్దిమందితో ప్రారంభమైన భవానీ మాలాధారణ ప్రస్తుతం వేలాది మంది భక్తులు దీక్ష తీసుకునే స్థాయికి చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. య-ఏవత కూడా పెద్ద సంఖ్యలో దీక్షలు స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు.

### రోజుకో రూపంలో అమ్మవారి దర్శనం

పది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. బాలాత్రిపురసుందరి, గాయత్రీదేవి, అన్నపూర్ణ, మహిషాసురమర్దిని, లలితాదేవి, మహాలక్ష్మి, దుర్గాదేవి, రాజరాజేశ్వరి తదితర రూపాల్లో ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. 108 రకాల నైవేద్యం, చండీ పారాయణం, లక్ష్మీ పూజ, సహస్రనామ పారాయణం, చండీ హోమం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



### అన్నదానానికి ప్రత్యేక ప్రాధాన్యం

ఆలయంలో అన్నదానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రతి నెల సంకటహర చతుర్థి సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కూడా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చివరి వరుసలో ఉన్న భక్తుడి వరకు ఆప్యాయంగా భోజనం అందించడం ఆలయ ప్రత్యేకతగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.

### భక్తి దాండియా ప్రత్యేక ఆకర్షణ

నవరాత్రి ఉత్సవాల్లో భక్తి దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా అమ్మవారిని స్మరిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి భక్తి భావంతో పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కొద్దిమందితో ప్రారంభమైన దాండియాలో ప్రస్తుతం వేలాది మంది పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రులతో పాటు ఏడాది పొడవునా ఆలయంలో వివిధ పండుగలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉగాది, శ్రీరామనవమి, శ్రావణ మాస వేడుకలు, వరలక్ష్మీ వ్రతం, వసంత పంచమి సామూహిక అక్షరాభ్యాసం, మహాశివరాత్రి, శాకాంబరి ఉత్సవాలు, నాగుల చవితి, గణేశ్ నవరాత్రులు, కృష్ణాష్టమి, దీపావళి, కార్తీక మాస పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. భక్తి భావంతో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## తాగునీటి కోసం రహదారి దిగ్బంధం

**ఖాళీ బిందెలతో రాస్తారోకో చేసిన మహిళలు**

**సర్పంచ్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ**

**కరీంనగర్ టూ హుస్నాబాద్ మార్గంలో నిలిచిన రవాణా**



చిగురుమామిడి,జనత న్యూస్:ఫోర్‌లేన్ రహదారి విస్తరణ పనుల వల్ల మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమై.. గత 15 రోజులుగా తాగునీరు రాక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం హుస్నాబాద్ టూ కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. కొండాపూర్ స్టేజీ వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా 9వ వార్డు మహిళలు మాట్లాడుతూ.. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి విస్తరణ పనుల్లో జేసీబీల తవ్వకాల వల్ల భగీరథ పైప్‌లైన్ దెబ్బతిన్నదని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ దెబ్బతిన్న పైపులకు బదులుగా కొత్త పైపులు, మెటీరియల్ సమకూర్చినప్పటికీ.. గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే పనులు చేపట్టలేదని ఆరోపించారు. వార్డులో ఉన్న రెండు బోర్లలో ఒకదానికి మోటారు అమర్చకపోవడం, ఉన్న మరొక బోరులో నీరు అడుగంటిపోవడంతో మంచినీళ్ల కోసం అర్ధరాత్రి 12 గంటల వరకు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోందని వాపోయారు. 15 రోజులుగా తాగునీటి కోసం నరకయాతన పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. మహిళలు రహదారిపై ఆందోళన చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు, బస్సులు గంటల కొద్దీ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. తక్షణ ఉపశమనంగా ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయించడంతో పాటు, దెబ్బతిన్న పైప్‌లైన్‌కు వెంటనే మ-రమ్మతులు పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామ-స్థులు ఆందోళన విరమించారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




కరీంనగర్, అక్టోబర్ 6, జనతా న్యూస్: కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో సమగ్ర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కార వివరాలను సమీక్షించారు. రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉండి నిందితులు పట్టుబడని కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వారిని వెంటనే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. కేసు స్వభావాన్ని బట్టి 60 లేదా 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలకు వినియోగిస్తున్న మ్యూల్ బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఇప్పటికే గుర్తించిన 29 బ్యాంకు శాఖల ఆధారంగా బాధ్యులపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రానున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# మైసంపల్లికి సాగునీరు.. ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

## గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా 2,197 ఎకరాలకు సాగునీరు: మంత్రి పొన్నం ప్రభాకర్



మైసంపల్లి, జనతా న్యూస్: గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తికావడంతో త్వరలో మైసంపల్లి, సముద్రాల గ్రామాల పరిధిలోని 2,197 ఎకరాలకు సాగునీరు అందనుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లెపల్లెలో ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా మైసంపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి అభివృద్ధి పనులను పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2007 నుంచి కొనసాగుతున్న గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తికావస్తున్నాయని తెలిపారు. సముద్రాల, మైసంపల్లి గ్రామాల్లో కాలువల కోసం 138 మంది రైతులకు పరిహారం, నిధులు అందించినట్లు చెప్పారు.

### ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. మూడో సంవత్సరం నుంచి ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వరకు దిగుబడి వచ్చే ఈ పంటకు నీటి వినియోగం తక్కువగా ఉంటుందని, కోతులు, దొంగల బెడద కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతుల నుంచి డీడీలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా ఇంటింటా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, గ్రామ కుంటలు నిర్మించాలని సూచించారు.

### పలు అభివృద్ధి పనులకు నిధులు

మైసంపల్లిలో 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. 300కు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. 298 మందికి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 226 మంది రైతులకు రుణమాఫీ, 664 మందికి రైతు భరోసా అందిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ అభివృద్ధి పనులకు రూ.388.49 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. 483 మందికి 8.64 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని, ఫంక్షన్లలో స్టీల్ ప్లేట్లు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైసంపల్లి గ్రామానికి వాటర్ ప్లాంట్, ఓపెన్ జిమ్ మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఐకేపీ సెంటర్ నుంచి కోహెడ, సీసీ పల్లి, కాచాపూర్, మైసంపల్లి గ్రామాలను కలుపుతూ 9.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.8.5 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కాచాపూర్ నుంచి పందిళ్ల వరకు బ్రిడ్జి, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లతో టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు.

# చెంచల్‌చెరువుపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



### గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చెంచల్‌చెరువుపల్లి, జనతా న్యూస్: 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లెపల్లెలో ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెంచల్‌చెరువుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.21 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, గ్రామపంచాయతీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్, ఏపీఐపీ, జెడ్పీ నిధులతో రూ.9 లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, రైతులు తమ పొలాల్లో ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని, సమీపంలోని నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి పంటను తరలించే అవకాశం ఉన్నందున రవాణా సమస్యలు తక్కువగా ఉంటాయని తెలిపారు. 14 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సున్న బాలికలు భవిష్యత్‌లో బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. సీసీపల్లి, కాచాపూర్, మైసంపల్లి గ్రామాలను కలుపుతూ రహదారి నిర్మాణానికి రూ.8.3 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్ బ్యాంకు ద్వారా 500 స్టీల్ పాత్రలు అందించినట్లు మంత్రి తెలిపారు. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వినియోగిస్తే జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరలో పూర్తై అందుబాటులోకి వస్తాయని, ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతుల పరిధిలోని 2,134 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. గతంలో ఇళ్లు మంజూరు కాలేదని, ప్రస్తుతం గ్రామానికి 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎల్లవేణి కమల, మెతుకు జ్యోతిలకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కాచాపూర్‌కు గౌరవెల్లి కాలువ నీరు

#### 1,100 ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు: మంత్రి పొన్నం ప్రభాకర్

కాచాపూర్, జనతా న్యూస్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతున్నాయా, ఇంకా ఏం చేయాలనే అంశాలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకునేందుకు 'పల్లె పల్లెకు పొన్నంఅన్న.. పల్లెపల్లెలో ప్రజాపాలన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాచాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధులు రూ.44.70 లక్షలతో చేపట్టిన దేవుల చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాచాపూర్, సీసీపల్లి గ్రామాలకు చెందిన సుమారు 1,100 ఎకరాలకు సాగునీరు అందించేలా గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ నీటిని తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రెండు గ్రామాలకు సంబంధించి భూములు కోల్పోయిన సుమారు 118 మంది రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్, పట్టు, జనుము వంటి పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, గ్రామంలో నీటి కుంటలు ఏర్పాటు చేసి నీటిని సంరక్షించుకోవాలని కోరారు. కోహెడ నుంచి మైసంపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. సీసీపల్లి, మైసంపల్లి, కాచాపూర్ గ్రామాలను అనుసంధానించే రహదారి నిర్మాణానికి రూ.8.3 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో, డీఆర్‌డీఓ, డీపీఓ, సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# తిమ్మాయపల్లిలో శ్రీ మల్లికార్జున యాదవ సంఘం నూతన కమిటీ

బెజ్జంకి, అక్టోబర్ 6, జనతా న్యూస్: బెజ్జంకి మండలం తిమ్మాయపల్లిలో శ్రీ మల్లికార్జున యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా మేకల యాదగిరి యాదవ్‌ను, ఉపాధ్యక్షుడిగా కల్లూరి నరేందర్‌ను, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మేకల శ్రీధర్, కోశాధికారిగా కల్లూరి రమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మేకల శ్రీకాంత్, కల్లూరి మహేందర్, మేకల రమేష్, కల్లూరి శ్రీనివాస్, కల్లూరి పెద్ద శ్రీనివాస్‌లను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన యాదవ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు యాదవుల ఐక్యత, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.



# కొత్తగట్టు వద్ద ర్యాంపు నిర్మాణం చేపట్టాలి

### గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జనతా న్యూస్: కొత్తగట్టు స్టేజీ వద్ద జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు రహదారిని సురక్షితంగా దాటేందుకు క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మించాలని సూచించారు. కొత్తగట్టు వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామానికి వెళ్లేందుకు సరైన ర్యాంపు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అండర్‌పాస్ నుంచి సాఫీగా రాకపోకలు సాగించేలా ఇప్పటికే ఒక వైపు నిర్మించిన ర్యాంపుతో పాటు మరో వైపు కూడా ర్యాంపు నిర్మించాలని కోరారు. గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ మంగళవారం రాత్రి తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, జాతీయ రహదారి--563 ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ తదితరులతో కొత్తగట్టు వద్ద నెలకొన్న పరిస్థితిపై చర్చించారు. ర్యాంపు లేక గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని జాతీయ రహదారి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# దీపావళి బాణసంచా దుకాణాలకు అక్టోబర్ 17 వరకు దరఖాస్తులు

కరీంనగర్, అక్టోబర్ 6, జనతా న్యూస్: దీపావళి పండుగను పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. నిర్దేశిత దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల మెమో, రూ.600 ప్రభుత్వ చలాన్, ఫైర్, రెవెన్యూ/మున్సిపల్ శాఖల నిరభ్యంతర పత్రాలను ఐదు సెట్ల జిరాక్స్ ప్రతులతో సమర్పించాలని సూచించారు. అక్టోబర్ 17 సాయంత్రం తర్వాత వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. అధికారులు అనుమతించిన బహిరంగ ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, ఒక క్లస్టర్‌లో గరిష్టంగా 50 దుకాణాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్ల ఖాళీ ఉండాలని, రక్షిత కట్టడాలకు కనీసం 50 మీటర్ల దూరం పాటించాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలని, దుకాణాల పరిసరాల్లో పొగతాగడం, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు, లైటర్లు వినియోగించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మార్గాలు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమెరాలు, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నివాస ప్రాంతాల్లో లేదా అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పరిమితికి మించి బాణసంచా నిల్వ చేసినా, ప్రజా భద్రతకు ముప్పు కలిగించినా లైసెన్స్ రద్దు చేసి చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ పోలీసుల సత్తా

### 16 పతకాలు కైవసం.. 9 బంగారు, 4 వెండి, 3 కాంస్య పతకాలు



కరీంనగర్, అక్టోబర్ 6, జనతా న్యూస్: 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది సత్తా చాటారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి మొత్తం 16 పతకాలు సాధించారు. ఇందులో 9 బంగారు, 4 వెండి, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. మహిళల విభాగంలో ఏసీపీ మాధవి టేబుల్ టెన్నిస్‌లో ఓపెన్ సింగిల్స్, 40౦ సింగిల్స్, ఓపెన్ డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్‌లో 50౦ సింగిల్స్‌లో బంగారు, 40౦ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించారు. డబ్ల్యూపీసీ స్వప్న టేబుల్ టెన్నిస్‌లో 40౦ డబుల్స్, ఓపెన్ డబుల్స్‌లో బంగారు, ఓపెన్ సింగిల్స్‌లో వెండి పతకం సాధించారు. బ్యాడ్మింటన్ 40౦ డబుల్స్‌లోనూ బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఏఎస్ఐ పి. ఉమారాణి టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పలు పతకాలు సాధించారు. హెచ్‌సీ సంజయ్ టేబుల్ టెన్నిస్‌లో వెండి, బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం సాధించగా, ఏఎస్ఐ సత్తయ్య బ్యాడ్మింటన్ 50౦ మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం గెలుచుకున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు గుర్తింపు తీసుకువచ్చిన అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు.

# పారదర్శకంగా అంగన్‌వాడీ ఎంపిక ప్రక్రియ

### మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ కృష్ణవేణి

కరీంనగర్,జనతా న్యూస్: అంగన్‌వాడీ టీచర్ల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీ పోస్టుల అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మంగళవారం రాత్రి ఆర్‌జేడీ కృష్ణవేణి పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలనలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోషణ మాస ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఆమె తెలిపారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులను సీడీపీవోలు నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com